క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేకువ జామున 5.30 గంటల నుంచి 6 గంటల వరకు తిరుప్పావై సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు



మార్గశిర మాసం పూజలకు ముస్తాబైన అమ్మవారు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసం బహుళ పంచమిని పురస్కరించుకుని విశేష అర్చనలు చేశారు. అర్చకులు పట్నాల హరిప్రసాద్‌శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో ఉదయం నిత్య అర్చనతో ప్రారంభించి ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చన జరిపించారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

గణితంలో రామానుజన్ కృషి ఎనలేనిది



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రొఫెసర్ సత్యం

కొమ్మాది: శ్రీనివాస రామానుజన్ గణితంలో అపారమైన కృషి చేశారని శివనాడార్ విశ్వవిద్యాలయం (ఢిల్లీ) గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డా.ఎ.సత్యం నారాయణరెడ్డి అన్నారు. ఆయన కృషి ప్రపంచ వ్యాప్తంగా గణితాన్ని సరికొత్త దశలో నిలిపిందన్నారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గీతంలో శుక్రవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత శాస్త్రంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

చేనేతమేళాకు వర్షం దెబ్బ



మూతబడిన స్టాల్స్

పీఎం పాలెం: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావం శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రమేళాపై కూడా పడింది. ఈ నెల 13న ప్రారంభించిన మేళాలో రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా కాశ్మీర్, బీహార్ తదితర ప్రాంతాల నుంచి కూడా హస్తకళ ఉత్పత్తిదారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 60 స్టాల్స్ ఏర్పాటు చేయగా కొన్ని స్టాల్స్‌లోకి వర్షం నీరు చొరబడటంతో తాము తయారు చేసిన ఉత్పత్తులను కాపాడుకోవడానికి స్టాల్స్ యజమానులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కారణంగా పడుకునేందుకు కూడా అనుకూలంగా లేక అవస్థలు పడుతున్నారు. సంక్రాంతి ముందు వస్త్ర విక్రయాలు ఆశాజనకంగా ఉంటాయని ఎంతో ఆశగా వస్తే, వర్షం దెబ్బ తీసిందని స్టాల్స్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచేసిన వాన

అన్నదాతలను వర్షం నిలువునా ముంచేసింది. వరుస తుపాన్లు వెంటాడటంతో పంటను రక్షించేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపనలు నీట మునిగాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట కనులముందే నీటిపాలవడంతో కన్నీటిపర్యంతమవుతున్నారు.

- మూడు మండలాల్లో నీట మునిగిన పొలాలు
- చేలోనే వరిపనలు
- ఆందోళనలో అన్నదాతలు



సుంకరపేటలో తడిచిన వరి పనలు



పాడుగుపాలెంలో నీట మునిగిన వరి పనలను బయటకు తెస్తున్న రైతులు



కుసులవాడలో వ్యవసాయక్షేత్రంలోనే వరిపనలు

తగరపువలస/పద్మనాభం: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఆలస్యంగా కోతలు పూర్తి చేసిన రైతులను నట్టేట ముంచాయి. మూడు మండలాలలో వరి పనలు చాలావరకు పొలంలోనే ఉండిపోయాయి. వందలాది ఎకరాల్లో పంటపొలాలు నీటిలో మునిగిపోయాయి. ఆనందపురం మండలంలోని పాడుగుపాలెంకు చెందిన రైతులు బంటుపల్లి పైడమ్మ, దొంతల సత్యనారాయణ తదితరులకు చెందిన మూడేసి ఎకరాల పంట నీటిపాలయింది. సచివాలయ, వ్యవసాయాధికారులు ముందస్తు జాగ్రత్తలు సూచించలేదని తెలుస్తుంది. దీంతో నిరక్షరాస్యులైన రైతులే ఎక్కువగా నష్టపోయారు. ఈ సారైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నీటిలోనే వరి గాలి దిబ్బలు

పద్మనాభం మండలంలో 2683 హెక్టార్లలో వరి పంట వేశారు. తుపాన్ హెచ్చరికలు రావడంతో కొంతమంది నూర్చకుండా పొలాల్లో గాలి దిబ్బలు పెట్టి వదిలేశారు. సుంకరపేట గ్రామంలో పలువురు రైతులు వరి పంట కోశారు. పొలం మీద ఉంచారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో గాలి దిబ్బలు నీటిలో మగ్గుతున్నాయి. ఇవి కూడా మొలకలు వచ్చే ప్రమాదం ఉండడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. కోసిన వరి పనలు వర్షపు నీటికి తడిచిపోయాయి.



బి.ఆర్.తాళ్లవలసలో కోయకుండా ఉన్న వరిపంటను పరిశీలిస్తున్న ఏడీ విజయ్ ప్రసాద్

వెంటాడుతున్న వరుస తుపాన్లు

అన్నదాతలను ఖరీఫ్ ప్రారంభం నుంచి తుపాన్లు వెంటాడుతూనే ఉన్నాయి. ఎన్నో కష్టాలకోర్చి పంటను కాపాడుకున్నా మూడు వారాల క్రితం ఏర్పడిన అల్పపీడనం కారణంగా భీమిలి డివిజన్‌లో వరి పంటలు నేలకొరిగాయి. పంటను కోసి వ్యవసాయక్షేత్రంలో పనలుగా ఉంచిన చేను వందల ఎకరాలలో నీట మునిగింది. కల్లాలలో నూర్చి ఉంచిన ధాన్యంలోకి నీరు చేరడంతో మొలకలు వచ్చి ఎందుకూ పనికిరాకుండా పోయింది. తేమ, మొలకల పేరుతో ప్రభుత్వం రైతుల నుంచి ఇప్పటికీ పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులు చెప్పిన ధరలకు తెగనమ్ముకున్నారు. పెట్టిన పెట్టుబడులు రాక ప్రభుత్వం మద్దతు ధర చెల్లించకపోవడంతో అప్పటి నష్టం నుంచే చాలామంది రైతులు కోలుకోలేదు. ఆనందపురం, పద్మనాభం మండలంలో రైతులకు తీరని కడగండ్లు మిగిల్చిన ఆ గాయం మరవక ముందే మరో తుపాను ముంచేసింది.

వ్యవసాయాధికారుల పరిశీలన

ఆనందపురం మండలంలోని జగన్నాథపురం, వెల్లంకి, పాడుగుపాలెం, కుసులవాడ పంచాయతీలలో వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 35 ఎకరాలలో వరి పంట కోసి పనలలో ఉన్నాయని, 175 ఎకరాలలో రైతులు పంట కోయకుండా వాయిదా వేసుకున్నారని చెప్పారు. రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఏవో చావా సంధ్యా రత్నప్రభ తదితరులు ఉన్నారు.

- పద్మనాభం మండలంలోని బి.ఆర్.తాళ్లవలస, ఐనాడ గ్రామాల్లో భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ శుక్రవారం పర్యటించి, వరి క్షేత్రాలను పరిశీలించారు. రెండు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి పంట నూర్పులు చేయకూడదన్నారు.
- పాంగ్రంగిలో మండల వ్యవసాయ అధికారి ఎంవీఎస్ చలం పర్యటించారు. నూర్చిన ధాన్యంపై రైతులతో టార్పాలిన్లు కప్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు.



జగన్నాథపురంలో వరి కుప్పలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

పొలాల్లో నీరు నిలిచినట్లయితే గట్లు కొట్టి నీటిని బయటకు పంపించాలి. తుపాను ఉధృతి తగ్గగానే ధాన్యం మొలకెత్తకుండా లీటర్ నీటిలో 20 గ్రాములు గడ్డ ఉప్పు ద్రావణాన్ని పనలు తడిచేలా పిచికారీ చేయాలి. ట్యాంకు నీటికి 250 గ్రాములు ఉప్పును చేర్చాలి. ఒకవేళ చేలు పడిపోయిన సందర్భాలలో వెంటనే పాయలు తీసి పక్కపక్క దుబ్బులను కట్టలుగా కట్టి నిలబెట్టాలి.

– కె.అప్పలస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

విశాఖకు గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భూగర్భ శాస్త్రవేత్త డా.రాజశేఖర్‌రెడ్డి

కొమ్మాది: విశాఖలో భౌగోళిక ప్రాధాన్యం గల ఎర్రమట్టిదిబ్బలు, తీరప్రాంతంలోని శిలలు, ప్రస్తుత మన్యం జిల్లాలోని బొర్రాగుహలు, బాక్సైట్ ఖనిజాలు, ప్రాచీన బౌద్ధ క్షేత్రాలకు యునెస్కో గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు తీసుకుని రావడం అవసరమని భూగర్భశాస్త్రవేత్త డా. డి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దీనికి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ తగిన కృషి చేస్తోందని పేర్కొన్నారు. గీతంలో నిర్వహించిన స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ చరిత్ర విభాగంలో శుక్రవారం నిర్వహించిన 'సంస్కృతి పరిరక్షణ, సవాళ్లు, అవకాశం' సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా 48 దేశాల్లో ప్రస్తుతం 213 వరకు యునెస్కో గ్లోబల్ జియో పార్కులు ఉన్నాయన్నారు. 5 ప్రాంతాలను జియో పార్క్ గుర్తింపు పొందడానికి అర్హమైనవిగా ప్రభుత్వం గుర్తించిదని, వాటిలో విశాఖ గ్లోబల్ జియో పార్క్ ఒకటని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల కింద ఉండే కంబాలకొండ, ఎర్రమట్టిదిబ్బలు, బౌద్ధ క్షేత్రాలు, బాక్సైట్ గనులకు జియో పార్కు మేనేజ్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు చేసి ఉమ్మడి పర్యవేక్షణ పరిధిలోకి తేవాల్సి ఉందన్నారు.

మెగా రక్తదాన శిబిరం నేడు

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ భీమిలి మండల పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. మహరాజుపేట కూడలి వద్ద కాశీరాజు ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్న ఈ శిబిరాన్ని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను కోరారు.

'పరీక్ష పే చర్చ'కు జనవరి 14 వరకు రిజిస్ట్రేషన్లు

- డైట్ ప్రిన్సిపాల్ జ్యోతి కుమారి

భీమునిపట్నం: విద్యార్థుల్లో పరీక్షలంటే ఆందోళన, భయం దూరం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడే అవకాశం కల్పిస్తూ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చలో పాల్గొనేందుకు జనవరి 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉందని డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారితో ప్రధాని మోదీ మాట్లాడుతారని, అలాగే ఇందులో క్విజ్ పోటీలను కూడా నిర్వహిస్తారని తెలియజేశారు. ఆసక్తి గలవారు గడువులోగా ఆన్‌లైన్ ద్వారా పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. https://innovateindia1.mygov.in/ లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9573573065 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మురుగు నీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులోని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన మురుగు నీరు తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. వార్డు పరిధిలోని సాగర్‌నగర్, ఎండాడ, ముబారక్ కాలనీ, రాజీవ్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి, కాలువలు మురుగునీటితో నిండిపోవడంతో 'కంపు కొడుతోంది' శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఏఎంవోహెచ్ కిషోర్ స్పందించారు. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి వ్యర్థాలను, మురుగునీరును సిబ్బందితో తొలగించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వార్డులో అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికి సూచించారు.



పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ కిషోర్

బీచ్ రోడ్డులో చిమ్మచీకటి



వీధిలైట్లు వెలగకపోవడంతో బీచ్ రోడ్డులో అంధకారం

కొమ్మాది: సాగర్‌నగర్-భీమిలి బీచ్ రోడ్డులో పలు చోట్ల అంధకారం నెలకొంది. రుషికొండ ఐటీ జంక్షన్ తరువాత, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, తిమ్మాపురం ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ వెలగక పూర్తి స్థాయిలో చీకటి అలముకుంది. ఈ ప్రాంతాల్లో ఒక్క లైటు కూడా వెలగకపోవడంతో రెండు రోజులుగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు వర్షం, మరోవైపు చీకటి కావడంతో ఇటుగా ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, లైట్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

గృహహింస బాధితులకు న్యాయ సలహాలు చేరాలి



గృహహింసపై అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నయీ చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గృహహింసపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి గృహహింస రూపాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. మహిళలు ఎక్కువగా గృహహింసకు గురవుతున్నా న్యాయసలహాలు అందక, ఇలాంటి కేసులు సమాజంలో పెరిగిపోతున్నాయన్నారు. 181 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా బాధితులు ఉపశమనం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వదలని వర్షం

రుషికొండ వద్ద ముందుకు వచ్చిన సముద్రం



రుషికొండ బీచ్ వద్ద కోతకు గురైన తీరం

కొమ్మాది: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో శుక్రవారం కూడా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీనితో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సాగరతీరంలో బలమైన ఈదురు గాలులుతో పాటు సముద్ర కెరటాలు భారీ ఎత్తున ఎగసి పడుతూ ముందుకు చొచ్చుకుని వచ్చాయి. దీంతో ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ భారీ స్థాయిలో కోతకు గురైంది. సాగర్‌నగర్, తొట్లకొండ, మంగమారిపేట, భీమిలి బీచ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పర్యాటక బీచ్ ప్రాంతాల్లో లైఫ్ గార్డులు, మెరైన్ పోలీసులు ఇక్కడకు వచ్చిన పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో తీర ప్రాంతాల్లో చలి తీవ్రత కూడా పెరిగింది.

జనజీవనానికి అంతరాయం

మధురవాడ: వాన వదలడం లేదు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉండటంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా దినసరి కూలీలు, చిరు వ్యాపారులు దుకాణాలు పూర్తిగా మూతపడి ఉపాధి కోల్పోయారు. ఎక్కడ చూసినా జనం గొడుగులు, రెయిన్ కోట్‌లతోనే రాకపోకలు సాగించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఒక వైపు చెరువును తలపించగా, మరో వైపు చిత్తడిగా ఉంది. దీంతో విద్యార్థులు ఆ బురదలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది.



గొడుగు సాయంతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు



చిత్తడిగా మారిన చంద్రంపాలెం హైస్కూల్ మైదానం

శిల్పారామంలో..

పీఎం పాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పీఎం పాలెంలో చాలా షాపులు మూతపడ్డాయి. శిల్పారామంలో నీరు చేరింది. ప్రయాణికులు లేకపోవడంతో బస్టాపులు, ఆటోస్టాండ్‌లు బోసిపోయాయి. భవన నిర్మాణకార్మికులు ఇంటికే పరిమితం కావలసి వచ్చింది.

నీట మునిగిన సర్వీస్‌రోడ్లు

తగరపువలస: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారి వెంట సర్వీస్‌రోడ్లు నీటమునిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ పరిధి సంగివలస మొదలుకుని మండలంలోని టి.నగరపాలెం, మహరాజుపేట, తాళ్లవలస ఆనందపురం మండలం వెల్లంకి, పెద్దిపాలెం, దుక్కవానిపాలెం, గుడిలోవ, కొంత్యాం గ్రామాల వద్ద జాతీయరహదారికి ఇరువైపులా సర్వీస్‌రోడ్లు ముంపునకు గురయ్యాయి. చాలావరకు ద్విచక్రవాహనాలు, ఆటోలు నీటిలో మొరాయించాయి. ఫుట్‌పాత్‌ల కింద డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో తరచూ వర్షాలకు సర్వీస్‌రోడ్లు కనిపించకుండా పోతున్నాయి. సర్వీస్‌రోడ్లు శుభ్రం చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



శిల్పారామంలో చేరిన వాన నీరు



సంగివలస వద్ద సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు

సంక్రాంతి అతిథి వచ్చేశారు

కొమ్మాది: ధనుర్మాసం ప్రారంభం కావడంతో హరిదాసుల సందడి మొదలైంది. సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ సంచరిస్తున్నారు. ఇంకా అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ డూడూ బసవన్నలు.. అంబ పలుకు, జగదంబ పలుకు అంటూ జంగమదేవరలు, కొమ్ముదాసుల సందడి మొదలు కానుంది.



ఎండాడలో హరినామ సంకీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

నగరపాలెం నెత్తిన కల్యాణమండపాల వ్యర్థాలు



టి.నగరపాలెం గోస్తనీనది తీరంలో వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ చుట్టూ బయటి వ్యక్తులు వ్యర్థాలు పారబోస్తున్నారు. పవిత్రమైన గోస్తనీనది తీరాన్ని కలుషితం చేస్తున్నారు. జాతీయరహదారిని ఆనుకుని అవంతి కళాశాల ఎదురుగా ఇటీవల ప్రారంభమైన రెండు కల్యాణమండపాలు, పలు హోటళ్ల యాజమాన్యాలు తమ వ్యర్థాలను పంచాయతీ నెత్తిన రుద్దుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వినియోగించిన కూరగాయలు, మాంస వ్యర్థాలతో పాటు పాలిథిన్ సంచులు, పూలమండపాల వ్యర్థాలను పడేస్తున్నారు. ఒక్కోసారి వీటిని తగలబెడుతుండగా, చాలాసార్లు అలాగే వదిలేయడంతో ప్రమాదకరమైన పాలిథిన్ వ్యర్థాలు, పూల వ్యర్థాలలో ఇనుప తీగెలు, మేకులు పశువుల పాలిట ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఈ వ్యర్థాలు పడేసే చోటుకు దగ్గరలోనే ఆలయాలు ఉన్నాయి. వీటిని తగలబెట్టినప్పుడు వచ్చే పొగ ఇక్కడివారికి ఇబ్బంది కలిగిస్తోంది.

పందుల పెంపకంతో నదీజలాలు కలుషితం

ఇదే పంచాయతీలో గోస్తనీనది అవతల అనధికారంగా చేపడుతున్న పందుల పెంపకం కారణంగా నదీజలాలు కలుషితం అవుతున్నాయి. పందుల కోసం గాజువాక నుంచి తీసుకువచ్చిన హోటళ్ల వ్యర్థాలు నదిలో కలిసిపోతున్నాయని పంచాయతీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది వీటిపై నిఘా ఉంచి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.